# స్కాములా.. స్కీములా..?

- అవినీతి కాంగ్రెస్ కావాలా.. సంక్షేమ పథకాల బీఆర్ఎస్ కావాలా..?
- హామీలన్నీ నెరవేర్చిన ఏకైక నాయకుడు కేసీఆర్
- మూడు గంటలకు మించి కరెంటొద్దంటున్న హస్తం పార్టీ
- ఆ పార్టీ వస్తే అరిగోస పడుతం
- 24 గంటల కరెంటిస్తున్న కేసీఆర్
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- పౌరసత్వం లేని వాళ్లకు ఈ ప్రాంతంలో ఓటడిగే హక్కుందా?
- ప్రజల కష్టసుఖాల్లో వెంట నడుస్తున్న ఎర్రబెల్లి
- ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలి
- మంత్రి సత్యవతిరాథోడ్

తొర్రూరు, అక్టోబర్ 30: ఈ ఎన్నికల్లో స్కాముల కాంగ్రెస్ పాలన కావాలో.. స్కీముల బీఆర్ఎస్ పాలన కావాలో ప్రజలు ఆలోచించాలని మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ పిలుపు నిచ్చారు. పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలంలోని ఎల్‌వైఆర్ గార్డెన్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన ఎన్నికల సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ ఇచ్చిన హామీలే కాకుండా ప్రజల సంక్షేమం కోసం నూతన పథకాలను తీసుకువచ్చి సమర్థవంతంగా అమలు చేసిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని అన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజా సంక్షేమం, అభి వృద్ధి గురించి ఆలోచించి ఉంటే తెలంగాణలో ఇంత పేదరికం ఎక్కడ ఉండేదని, కనీసం ఇళ్లు లేకుండా ఉండే వారు ఇంత మంది ఉండేవారా అని ఆలోచించుకోవాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అరిగోస పడుతామని పేర్కొన్నారు. రైతులు, మహిళల బాధలు తీర్చేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా పథకాలను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ద్వారా కరువు నేలలను సస్యశామలం చేశారని కొనియాడారు. 24 గంటల కరెంట్ ఇచ్చి వ్యవసాయాన్ని, పారి శ్రామిక రంగాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ చెబుతున్నట్టు వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ కావాలో... కేసీఆర్ చెబుతున్నట్లు 24 గంటల కరెంట్ కావాలో ప్రజలు తేల్చుకోవాలని సూచించారు. దేశంలో ఎక్క డా లేని విధంగా రైతులకు రైతుబంధు, రైతు బీమా పెట్టిందని బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా.. అని ప్రతి ఒక్కరూ ఆలోచించా లని కోరారు. తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన ఘతన కేసీఆర్‌కే దక్కిందన్నారు. కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అక్కడ అమలు చేయలేని హామీలను ఇక్కడ ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు.

**పౌరసత్వంపై కనీస అవగాహన లేని ఝాన్సీరెడ్డి**

పాలకుర్తి పోటీ కోసం వచ్చిన ఝా న్సీరెడ్డి లాంటి వారికి పౌరసత్వం గురించే కనీస అవగాహన లేకుండా ప్రజలను మభ్యపెట్టి తిరిగి కోడలుకు కాంగ్రెస్ టిక్కెట్ ఇప్పించుకున్న వ్యక్తికి ఇక్కడి ప్రజల గురించి ఏం తెలుస్తుందని మంత్రి సత్యవతిరాథోడ్ ప్రశ్నించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఓటమి ఎరుగని నేతగా మచ్చలేని మంత్రిగా పాలకుర్తి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న మంత్రి దయాకర్‌రావును ఈ సారి లక్ష మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రతి కార్యకర్త ఒక కేసీఆర్‌గా మారాలని, ఒక్కొక్కరు ఒక దయాకర్‌రావులా కావాలని, తెలంగాణ రాక ముందు మన ప్రాంతం ఎట్ల ఉండే? ఇప్పుడు ఎట్ల అభివృద్ధి చెందిందో ప్రచార రూపంలో ప్రజల ముందు ఉంచాలని సూచించారు. ఇవ్వాల అందరి దృష్టి పాలకుర్తిపైనే ఉందని, రూ. వేల కోట్ల ఆస్తులు ఉన్న ఝాన్సీరెడ్డి ఆమె కోడలును పోటీ చేయిస్తున్నారని, డబ్బులతో ఓట్లు కొనుక్కోవచ్చని ఆలోచిస్తున్న వీరికి తగి న బుద్ధి చెప్పాలన్నారు. కోట్ల రూపాయలు కుమ్మరిస్తే టికెట్లు పంచుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఆ పార్టీ నాయకులే రేటెంతరెడ్డి అని పిలుస్తున్నారని, బెయిల్‌పై వచ్చి బయట తిరుగుతున్న దొంగ అని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి లాంటి దొంగ నాయకత్వంలో పని చేస్తున్న వారికి మనం ఓటు వేద్దా మా అని, ఎన్నికలప్పుడు టూరిస్టులా వచ్చి వెళ్లే వారిని ఆదరిద్దామా ప్రజలు ఆలోచించుకోవాలని, అభివృద్ధే కేరాఫ్‌గా పాలకుర్తిని మలిచిన దయాకర్‌రావును ప్రతి ఒక్కరూ కడుపు లో పెట్టుకుని కాపాడుకోవాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుడు ఉడుత లింగేశ్‌కుమార్‌యాదవ్ రాసిన పాలకుర్తి గడ్డ మీద రామక్క, గులాబీ జెండలే రామక్కా అనే పాటను మంత్రి ఎర్రబెల్లి ఆవిష్కరించారు. పాట అద్భుతంగా వచ్చిందని, లింగెశ్‌కు.మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నూకల నరేశ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉష, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ ఎల్ వెంకటనారాయణగౌడ్, మాజీ ఎంపీపీ కర్నె సోమయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ పొనుగోటి సోమేశ్వర్‌రావు, పార్టీ మండల ఇన్‌చార్జులు ఎస్ఎస్‌రెడ్డి, ఆర్ బీ ఎస్ జిల్లా కమిటీ సభ్యుడు రామసహాయం కిషోర్‌రెడ్డి, మండల కోఆర్డినేటర్ దేవేందర్ రెడ్డి, కుర్ర శ్రీనివాస్ పాల్గొన్నా రు.

**బీఆర్ఎస్‌లో వలసల జోరు..**

పాలకుర్తి నియోజకవర్గంలో పలు మండలాలు, వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతుండగా, వారికి మంత్రి ఎర్రబెల్లి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. మండలంలోని చీకటాయపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు వేల్పుకొండ లింగయ్య, డొంక యాకయ్య, తొర్రూరు మాజీ ఎంపీపీ గంపల శంకరయ్య అధ్వర్యంలో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

**తొర్రూరు ఆటో యూనియన్..**

తొర్రూరుకు చెందిన ఆటో యూనియన్ నాయకులు మంగళపల్లి యాకయ్య, కుంటకొమ్ము నాగరాజు, ఖమ్మంపాటి దినేశ్, బానోత్ శ్రీను, గొల్లపల్లి నరేశ్, బంధు వెంకటేశ్, మంగళపల్లి సా గర్, ప్రభు, దయాకర్, శ్రీకాంత్, నల్లగురి రామ్మూర్తి, సాయి, బిన్నీ, ఉపేందర్, మధు, అశోక్, సుధాకర్, గణేశ్ మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. చింతలపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు గులాబీ గూటికి చేరారు. ఈదులకుంట తండా, భోజ్యా తండాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఎన్ రాములు, రామ్‌చరణ్, భిక్షం, సంతోష్, యాకూబ్, నవీన్, సందీ ప్, సురేశ్, సుధాకర్, రామచంద్రు, బుజ్జి, విజయ్, లింగా, భిక్షం, నరేశ్, రమేశ్, నాగేశ్, బీ రమేశ్, సూర్య, తేజ, వెంకన్న, దిలీప్, పన్య, వంశీ, లలిత, నెహ్రూ, రవి, ఆగా, రావుజ, రాజు బీఆర్ఎస్‌లో చేరారు.

**ప్రభాకర్‌రెడ్డిపై దాడి హేయనీయం: ఎర్రబెల్లి**

మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి ఘటనను పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఓటమి భయంతో ఇలాంటి దాడులకు పాల్పడే వారికి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకో వాలని అకాంక్షించారు.



కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి దయాకర్‌రావు

# కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంట్ కష్టాలే

- ప్రభుత్వరంగ సంస్థలను అమ్మి ప్రజా ధనాన్ని కొల్లగొట్టిన బీజేపీ
- బీఆర్ఎస్ వస్తే కరెంట్ ఫుల్, రూ. 400లకే గ్యాస్
- పోడు రైతులకు పట్టాలు ఇచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే
- మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

కేసముద్రం, అక్టోబర్ 30: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మళ్లీ కరెంట్ కష్టాలు తప్పవని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని కాట్రపల్లి, అర్పనపల్లి, ఉప్పరపల్లి, వెంకటగిరి, ఇంటికన్నె గ్రామాల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసీఎం కేసీఆర్ మరోసారి అధికారంలోకి వస్తే రూ.4 వందలకే గ్యాస్, ఎకరానికి రూ.16 వేలు అందిస్తాడన్నారు. పోడు రైతులకు పట్టాలు ఇచ్చి ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకుంటూ ప్రజాధనాన్ని కొల్లగొడుతోందన్నారు. చిన్న పిల్లలు తాగే పాలమీద జీఎస్టీ వేసిన ఘనత బీజేపీదే అన్నారు. కాంగ్రెస్ పాలిస్తున్న రాష్ట్రాల్లో రైతు బంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి వంటి పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 3 గంటల కరెంట్ చాలంటున్న కాంగ్రెస్‌కు ఓటు వేస్తారా.. 24 గంటలిచ్చే బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తారా.. ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. రైతు బంధు ఇవ్వొద్దని ఎన్నికల అధికారులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫిర్యాదు చేసిన విషయాన్ని రైతులు గుర్తుంచుకోవాలన్నారు. సారా ప్యాకెట్, డబ్బులు ఇస్తే గిరిజనులు ఓటు వేస్తారని హేళనగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులకు గిరిజనులు బుద్ధి చెప్పాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధికి, పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు మరోసారి అండగా ఉండాలని కోరారు. కాట్రపల్లి గ్రామంలోని శివాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ మర్రి రంగారావు, ఎంపీపీ ఓలం చంద్రమోహన్, జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచ్‌ల పోరం జిల్లా అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం దుర్గేశ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు నజీర్ అహ్మద్, కముటం శ్రీనివాస్, నాయకులు ఘనపారపు రమేశ్, కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, జాటోత్ హరీశ్‌నాయక్, గందసిరి సోమన్న, సూరయ్య, సరిత, గుంజపాడుగు కొమ్మన్న, గుడ్ల శ్రీనివాస్, పెద్దగాని వెంకటేశ్వర్లు, మోడెం రవీందర్‌గౌడ్, గుగులోత్ వీరూనాయక్, మంచాల యాక రాజ్యం, షేక్‌జానీ, మోడెం రాజు, బీరయ్య ఉన్నారు.



ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

# స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- పకడ్బందీగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు
- ఎన్నికల విధుల్లో 5వేల మంది పోలీసులు
- ఇప్పటివరకు రూ.4.55కోట్ల నగదు జప్తు
- 4,078 మంది పాత నేరస్తుల బైండోవర్
- 'నమస్తే' ఇంటర్వ్యూలో వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

సుబేదారి, అక్టోబర్ 30 : ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా కోరారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో మాడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు, బందోబస్తు వివరాలను 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు.

**నమస్తే : ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత పోలీసు శాఖ తీసుకున్న చర్యలు?**

సీపీ : కమిషనరేట్ పరిధిలో పకడ్బందీగా మాడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు చేయడానికి డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బందిని అలర్ట్ చేసి, క్షేత్ర స్థాయిలో బాధ్యతలు అప్పగించాం. నగదు, మద్యం పంపిణీకి అడ్డుకట్ట వేయడానికి చెక్ పోస్టులను ఏర్పాటు చేశాం. వరంగల్, హనుమకొండ, జనగామ కలెక్టర్లతో (జిల్లా ఎన్నికల అదికారులు) ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నాం. ఈ మూడు జిల్లాల్లో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు పూర్తి స్థాయిలో, మూడు పాక్షికంగా ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో నియోజకవర్గాల రిటర్నింగ్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో కలిసి పోలీసు నోడల్ ఆఫీసర్లు(ఏసీపీ స్థాయి) సమన్వయంతో పని చేస్తున్నారు. 'సి విజిల్' యాప్ గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రచార సభలు, సమావేశాల కోసం 'సువిధ' యాప్ ద్వారా అనుమతులు ఇస్తున్నాం. ఆర్‌వో అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారం చేస్తే కేసులు నమోదు చేస్తాం.



**నమస్తే : స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం, నమోదు చేసిన కేసుల వివరాలు?**

సీపీ : జనగామ జిల్లా సరిహద్దు పెంబర్తి, మహబుబాబాద్ జిల్లా సరిహద్దు ఖానాపురం, కరీంనగర్ జిల్లా సరిహద్దు పెంచికలపేట, ములుగు జిల్లా సరిహద్దు కటాక్షపూర్‌తో పాటు కమిషనరేట్ పరిధిలోని మొత్తం 10 చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. ఈ నెల 9 నుంచి 29వ తేదీ వరకు 165 మంది నుంచి రూ.4,55,05,812 నగదు, 2,609 లీటర్ల మద్యం (రూ.15.64లక్షలు), రూ.7.36లక్షల విలువైన గుడుంబా, పటిక, 5.990 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నాం. తగిన ఆధారాలు చూపించిన 50 శాతం మందికి జిల్లా గ్రీవెన్స్ కమిటీ ద్వారా నగదు తిరిగి ఇచ్చాం. ఎన్నికల సామగ్రికి సంబంధించి 17 కేసులు నమోదు చేశాం. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ముందస్తుగా 4,038 మంది పాత నేరస్తులను బైండోవర్ చేశాం.

**నమస్తే : శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకున్న చర్యలు?**

సీపీ : ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు. 100 డయల్ ద్వారా లేదా 8712685257 వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేస్తే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తాం. సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఇప్పటి వరకు 12 కేసులు నమోదు చేశాం. సోషల్‌మీడియాలో వివాదాస్పద పోస్టులు పెట్టినా కేసులు నమోదు చేస్తాం. ఈ పోస్టులపై ఆర్‌వోకు ఫిర్యాదు చేయాలి. ఆర్‌వో ఆదేశాల మేరకు పోలీసు శాఖ చర్యలు తీసుకుంటుంది. వరంగల్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 2,125 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. వీటిలో 6 పోలింగ్ స్టేషన్లు సమస్యాత్మక, 35 అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు. వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఇప్పటికే కమిషనరేట్ పరిధిలోని 45 పోలీసు స్టేషన్లలో చాలా వాటిని సందర్శించాను. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశాను. .

**నమస్తే : బందోబస్తు కోసం ఎంత మంది పోలీసులను నియమిస్తున్నారు?**

సీపీ : కమిషనరేట్ పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడం కోసం తగిన భద్రత ఏర్పాటు చేస్తున్నాం. ఎన్నికల బందోబస్తు కోసం కేంద్రం నుంచి 18 పారా మిలటరీ బలగాలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఆరు కంపెనీలు వచ్చాయి. కమిషనరేట్, రాష్ట్ర పోలీసు శాఖ నుంచి మరో 2,500 పోలీసులు ఎన్నికల విధుల్లో పాల్గొంటారు. ఎక్కడ ఎలాంటి సమస్య రాకుండా ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరుగడానికి అన్ని రాజకీయ పక్షాలు, ప్రజలు సహకరించాలని కోరుతున్నాం.